సాక్షి
వికారాబాద్
శనివారం । 30 । డిసెంబర్ । 2023



ఈకేవైసీ కోసం పడిగాపులు

ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల చుట్టూ వినియోగదారులు పడిగాపులు కాస్తున్నారు. 10లో▸



గరం.. గరంగా..

కుల్కచర్ల మండల కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. 10లో▸



ఆర్థిక పురోగతి సాధించాలి

మహిళలు ఆర్థిక పురోగతిని సాధించాలని ఎస్‌బీఐ జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ రాంబాబు అన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలి

అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



శివారెడ్డిపేట్ ప్రజాపాలనలో పాల్గొన్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్ది మడుగు గ్రామం, మున్సిపల్ పరిధిలోని శివారెడ్డి పేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభలకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుభాషిని, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీపీ చంద్రకళ, వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు సమయాల్లో మార్పులు

వికారాబాద్ అర్బన్: కలెక్టర్ ఆదేశాల మేరకు సీసీఐలో పత్తి కొనుగోలు సమయాల్లో మార్పులు చేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పత్తి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4గంటలోపు కేంద్రాలకు రావాలని రైతులకు సూచించారు.

మూడు రోజులు నిలిపివేత

కొడంగల్ రూరల్: మండలంలోని నీటూర్ గేటు సమీపంలో గల విజయ కాటన్ మిల్లులో మూడు రోజుల పాటు పత్తి కొనుగోలు ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి సారంగపాణి తెలిపారు. 30, 31, 01వ తేదీల్లో పత్తి కొనుగోలు ఉండదన్నారు. మంగళవారం నుంచి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

'అభయహస్తం' దరఖాస్తులు విక్రయిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

తుర్కయంజాల్: అభయహస్తం పథకం అమలు కోసం ప్రభుత్వం అందజేస్తు్న దరఖాస్తు ఫారంలను విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి కార్యక్రమం కొనసాగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిరాక్స్ సెంటర్స్, మీ సేవా కేంద్రాల్లో, ఇతర దుకాణాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వం

జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్



మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

షాబాద్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వమే ప్రజల వద్దకు వస్తుందని జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, పీడీ డీఆర్‌డీఓ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం వారు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఐదు గ్యారంటీలకు ఒకే దరఖాస్తు చేసుకోవాలని, ప్రజాపాలన కార్యక్రమంలో అర్జీలు పెట్టుకోని వారు జనవరి 6వరకు పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, షాబాద్ సర్పంచ్ సుబ్రమణేశ్వరి రవీందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈర్లపల్లిలో పర్యటించిన అధికారులు

చేవెళ్ల: గ్రామాల్లో చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీసీఈఓ దిలీప్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం వారు మండల పరిధిలోని ఈర్లపల్లిలో దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటర్ల వద్ద చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హిమబిందు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, మండల వ్యవసాధికారి తులసి, సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

సాయం.. ఆలస్యం

రైతుబంధు డబ్బు కోసం ఎదురుచూపులు

- జిల్లాలో 2.95లక్షల మంది రైతులు, 6,23,392 ఎకరాల సాగు భూమి
- అందాల్సిన మొత్తం రూ.322.76 కోట్లు
- ఇప్పటి వరకు 69వేల మంది రైతుల ఖాతాల్లో 18.89 కోట్లు జమ
- యాసంగి సాగుకు ఇబ్బంది పడుతున్న అన్నదాతలు



తాండూరు సమీపంలో సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

తాండూరు: యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు రైతుబంధు పథకం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ పథకం నెల రోజుల ముందే అమలు కావాల్సి ఉన్నా.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆగిపోయిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం.. రైతుబంధు పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించడం చకచకా జరిగిపోయింది. అయితే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం పడడం ఆలస్యం అవుతుండడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే యాసంగి సీజన్ ప్రారంభమైందని, సాయం అందకపోతే పంటల సాగు కష్టమని రైతులు అంటున్నారు. రెండు వారాల వ్యవధిలో జిల్లాలోని 69,721 మంది రైతుల ఖాతాల్లో రూ.18.89కోట్లు జమ చేశారు. ఒక ఎకరా, రెండు ఎకరాలున్న రైతుల ఖాతాల్లో మాత్రమే పెట్టుబడి సాయం జమ అవుతోంది. జిల్లా వ్యాప్తంగా 6,23,392 ఎకరాల్లో 2.95 లక్షల మంది రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. రైతుబంధు పథకం కింద వానాకాలం, యాసంగి సీజన్లలో ఒక్కో ఎకరా సాగుకు రూ. 5వేల చొప్పున పెట్టుబడి అందించేవారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే రైతుబంధు పథకం మొత్తాన్ని రూ.15 వేలకు పెంచుతామని హామీ ఇచ్చింది. హస్తం పార్టీ అధికారంలోకి రావడంతో రైతులు పెట్టుబడి సాయం పెరుగుతుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఎదురుచూపులు

యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 2,96,796 మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఎకరాకు రూ. 5వేల చొప్పున రైతుల ఖాతాల్లో రూ.322.76 కోట్లు జమ చేయాల్సి ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు 2,66,138 మంది రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేశారు. 1.56లక్షల మంది రైతుల ఖాతాల వివరాలను ట్రెజరీ అధికారులకు పంపారు. అయితే ఇప్పటి వరకు ఎకరా పొలం కలిగిన సుమారు 60 వేల మందికి 15 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశారు. మూడు రోజుల క్రితం రెండు ఎకరాలు ఉన్న రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేశారు. రెండు విడతలుగా 69,721 మంది రైతులకు రూ.18.89 కోట్ల పెట్టుబడి డబ్బులు జమ చేశారు.

ఆర్థిక ఇబ్బందులు



ఏడు ఎకరాల్లో కంది, పత్తి పంటలు సాగు చేశా. ప్రస్తుతం ఉల్లి పంట సాగు చేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి రైతుబంధు డబ్బు అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే పెట్టుబడి సాయం విడుదల చేయాలి.

– బాలకిష్టయ్య, రైతు, ఐనెల్లి

ట్రెజరీకి పంపాం



రైతుబంధు పథకానికి సంబంధించిన వివరాలు ట్రెజరీకి పంపాం. విడతల వారీగా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అవుతుంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు. జనవరి నెలలో రైతులందరికీ పెట్టుబడి సాయం అందుతుంది.

– గోపాల్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి

పరిగికి రైల్వే లైన్ తెస్తాం

- అర్హులకు ఆరు గ్యారంటీలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- మొదటి రోజు వంద గ్రామసభలు: కలెక్టర్ నారాయణరెడ్డి

పరిగి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీలు చేరాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని మాధారం గ్రామంలో కలెక్టర్ నారాయణరెడ్డితో కలసి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జనవరి 6వ తేదీ వరకు ప్రతి గ్రామం, వార్డులో సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచామన్నారు. వంద రోజుల్లో మిగిలిన గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఇందులో భాగంగానే ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు. పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచుతామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. రైతు భరోసా పథకం కింద ఏటా రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. భవిష్యత్తులో భూ సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. పరిగి ప్రాంతానికి రైలు మార్గాన్ని తెచ్చి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. అలాగే ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేసి లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో, వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రజాపాలన కోసం జిల్లా వ్యాప్తంగా 57 టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి రోజు 87 గ్రామ పంచాయతీలు, 13 మున్సిపల్ వార్డుల్లో 100 సభలు నిర్వహించినట్లు చెప్పారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి తప్పులు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, ప్రత్యేక అధికారి తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాధారం గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్



బోధనా పద్ధతులు తెలుసుకుంటున్న డీఈఓ రేణుకాదేవి

'మన బడి' పనులు పూర్తి చేయండి

డీఈఓ రేణుకాదేవి

మర్పల్లి: మన ఊరు – మన బడి పథకం కింద మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలని డీఈఓ రేణుకాదేవి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు శాతం, రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాలలకు మంజూరైన పనులు ఎందుకు పూర్తి చేయలేదని హెచ్‌ఎంలను ప్రశ్నించారు. సిరిపురం పాఠశాల అభివృద్ధికి రూ. 55లక్షలు మంజూరైన పనులు పూర్తి కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అందుకోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. 4వ తరగతి విద్యార్థులతో తెలుగు రాయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రఫీయొద్దీన్, ఎస్తేర పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించండి

అనంతరం మధ్యాహ్న భోజనం పథకం వర్కర్లు డీఈఓను కలిశారు. తమకు 5నెలలుగా బిల్లులు రావడం లేదని తెలిపారు. త్వరగా మంజూరయ్యేలా చూడాలని కోరారు. స్పందించిన డీఈఓ ఈ విషయం పరిశీలనలో ఉందని, ప్రభుత్వం త్వరలో బిల్లులు విడుదల చేస్తుందని తెలిపారు.

సమాచారం.. సులభతరం

- ఎమ్మార్సీల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు
- ఒక్కో మండలానికి ఆరు చొప్పున 108 కంప్యూటర్లు మంజూరు

దౌల్తాబాద్: విద్యాశాఖలో టెక్నాలజీ వినియోగాన్ని పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ప్రభుత్వ బడుల్లో ఆన్‌లైన్ విద్య కోసం ప్యానెల్ బోర్డులు మంజూరు చేయగా.. తాజాగా విద్యా వనరుల కేంద్రాలకు కంప్యూటర్లు మంజూరు చేసింది. ఇప్పటి వరకు ప్రతి ఎమ్మార్సీలో రెండు కంప్యూటర్లే ఉండడంతో పాఠశాలల పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్ చేసేందుకు ఇబ్బందులు ఎదురయ్యేవి. సమాచార మార్పిడి తోపాటు ఇతర పనులకు జాప్యం జరిగేది. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని వేగంగా ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ సమస్యకు ఇకపై చెక్ పడనుంది. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లాలోని అన్ని ఎమ్మార్సీలకు కంప్యూటర్లతో పాటు ప్రింటర్లు, ఎంఎస్ ఆఫీస్ సాఫ్ట్‌వేర్, స్విచ్ బోర్డులు, బ్యాక్ ప్యానెల్ తదితర సామగ్రి చేరింది. త్వరలోనే వీటిని ఇన్‌స్టాల్ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



దౌల్తాబాద్ ఎమ్మార్సీకి చేరిన కంప్యూటర్లు

కొత్త మండలాలకు మినహా..

జిల్లాలో కొత్తగా ఏర్పడిన వాటితో కలసి 20 మండలాలు ఉన్నాయి. పాత మండలాలు 18 ఉండగా అన్ని చోట్ల విద్యా వనరుల కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రానికి ఆరు చొప్పున 108 కంపూటర్లు మంజూరయ్యాయి. నూతనంగా ఏర్పడిన దుద్యాల, చౌడపూర్ మండలాలకు మంజూరు కాలేదని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఎమ్మార్సీల్లో ఎంఈఓలు, సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు విధులు నిర్వహిస్తుంటారు. ఇక్కడ అవసరం మేరకు కంప్యూటర్లు ఏర్పాటు చేయనుండడంతో సీఆర్పీలు వారి పరిధిలో సేకరించే సర్వే వివరాలను వేగంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవకాశం కలుగుతుంది. ఏది ఏమైనా విద్యాశాఖ అధికారులు ఎమ్మార్సీలకు కంప్యూటర్లు మంజూరు చేయడంపై పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తొలగినట్లే

జిల్లాలోని 18 విద్యా వనరుల కేంద్రాలకు 108 కంప్యూటర్లు మంజూరయ్యాయి. ఇంత వరకు ఒక్కో కేంద్రంలో ఒకటి లేదా రెండు కంప్యూటర్లు మాత్రమే ఉండేవి. దీంతో సమాచార మార్పిడి, ఇతర సాంకేతిక పనులకు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇకపై ఏ ఇబ్బంది ఉండదు. త్వరలోనే వాటిని ఇన్‌స్టాల్ చేయిస్తాం.

– రేణుకాదేవి, డీఈఓ

వ్యయ వివరాలు సమర్పించాలి

- ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్లలో పోటీ చేసిన అభ్యర్థులంతా ఎన్నికల ఖర్చులు చూపాలి
- లేదంటే మూడేళ్ల వరకు పోటీకి అనర్హులు
- జిల్లా వ్యయ పరిశీలకులు వినోద్‌కుమార్ అహిర్వార్, ప్రియారంజ్ శ్రీవాస్తవ, శంకర్‌గుప్తా



మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల ఖర్చు వివరాలను గడువులోగా సమర్పించాలని జిల్లా వ్యయ పరిశీలకులు వినోద్ కుమార్ అహిర్వార్, ప్రియారంజాన్ శ్రీవాస్తవ, శంకర్ గుప్తా అన్నారు. 2023 శాసన సభ ఎన్నికల్లో జిల్లాలోని ఎనిమిది సెగ్మెంట్ల నుంచి పోటీ చేసిన అభ్యర్థులంతా ఎన్నికల ప్రచారంలో చేసిన ఖర్చు మొత్తాలను సరిచూసుకుని అవసరమైన వివరాలను సమర్పించాలని సూచించారు. పోటీ చేసిన అభ్యర్థులు చేసిన ఖర్చుల వివరాలు సరిపోల్చుకునేందుకు వీలుగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం రీకన్సిలేషన్ నిర్వహించారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు వినోద్‌కుమార్ అహిర్వార్, ప్రియారంజాన్ శ్రీవాస్తవ, శంకర్ గుప్తా అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలను, వ్యత్యాసాలను పరిశీలించారు.

సమీపిస్తున్న గడువు

ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతీ అభ్యర్థి ఎన్నికల ఖర్చుకు సంబంధించి రోజువారీ ఖాతా రిజిస్టర్, నగదు లావాదేవీల రిజిస్టర్, బ్యాంక్ రిజిస్టర్, స్టేట్‌మెంట్ (పార్ట్–1 నుంచి 4 వరకు), షెడ్యూల్‌లో 1 నుంచి 11 వరకు గల ఎన్నికల ఖర్చుల వివరాలను సరి చూసుకుని సరైన క్రమ సంఖ్యతో కూడిన అన్ని బిల్లులు, వోచర్లు, ఒరిజినల్ అఫిడవిట్, స్వీయ ధ్రువీకరణతో కూడిన బ్యాంకు స్టేట్‌మెంట్ తదితర వాటిని ఎన్నికల ఫలితాలు ప్రకటించబడిన 30 రోజులలోపు సమర్పించాల్సి ఉంటుందన్నారు. బ్యానర్స్, పోస్టర్స్, దినపత్రికలు, టీవీ ఛానల్స్‌లో ఇచ్చిన ప్రకటనల వివరాలు, వాటికైనా ఖర్చుల వివరాలు తెలియజేయాలన్నారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లకు సరైన రీతిలో ఖర్చుల వివరాలను సమర్పించేలా ఏఈఓలు మార్గనిర్దేశం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల ఖర్చులకు సంబంధించిన వివరాలను సకాలంలో, నిర్ణీత పద్ధతిలో సమర్పించని పక్షంలో అలాంటి వారికి నోటీసులు జారీ చేస్తామని, నిర్ణీత కాల వ్యవధిలోపు స్పందించని వారిపై ఆర్పీచట్టం, 1951లోని సెక్షన్ 10ఎ ప్రకారం అనర్హత విధించాలని కోరుతూ.. ఎలక్షన్ కమిషన్‌కు లేఖ అందజేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ ద్వారా అనర్హులుగా ప్రకటించబడిన వారు మూడేళ్ల వరకు ఎటువంటి ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం ఉండదన్నారు.

తగ్గిన నేరాలు

- గత ఏడాది 3,788 కేసులు నమోదు
- ఈ సంవత్సరం 3,588
- తగ్గిన రోడ్డు ప్రమాదాలు.. పెరిగిన మృతుల సంఖ్య



వికారాబాద్: గత ఏడాది(2022)తో పోలిస్తే ఈ సంవత్సరం నేరాలు తగ్గాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్, నిఘా వ్యవస్థల బలోపేతం, నిరంతర అవగాహన కార్యక్రమాలు, సత్వరం స్పందించడం వంటి కారణాల వల్ల నేరాల సంఖ్య తగ్గింది. కొన్ని చోట్ల పోలీసులు సివిల్ తగాదాల్లో తలదూర్చారనే ఆరోపణలు బలంగా వినిపించాయి. చన్గొముల్, వికారాబాద్, నవాబుపేట, మోమిన్‌పేట, తాండూరు, ధారూరు తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో సివిల్ డిస్ప్యూట్స్‌లో పోలీసుల జోక్యం పెరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. అయితే గతేడాదితో పోలిస్తే హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, మిస్సింగులు, లైంగిక దాడులు, ప్రమాదాలు తగ్గడం ఊరటనిస్తోంది. గుట్కాల విక్రయాలు, రేషన్ బియ్యం స్మగ్లింగ్, ఇసుక దందా వంటి వాటిని కట్టడి చేయటంపై పోలీసులు సక్సెస్ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా 2022లో 3,788 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 200 తగ్గి 3,588 కేసులు నమోదయ్యాయి. అయితే గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సీసీ టీవీల ఏర్పాటులో పోలీసులు వెనకబడ్డారు.

ఫిర్యాదులు బుట్టదాఖలు

ఇటీవలి కాలంలో చాలా వరకు ఫిర్యాదులు ఎఫ్ఐఆర్ నమోదు కాకుండా లేదు. పోలీస్ స్టేషన్లలో నేతల ప్రభావం పెరిగి పోవడంతో వారి ఒత్తిళ్లకు తలొగ్గి వచ్చిన ఫిర్యాదుల్లో చాలా వరకు పక్కన పడేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంకొన్ని సందర్భాల్లో ఆమ్యామ్యాలకు తలొగ్గి కూడా కేసులు నమోదు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల భూ వివాదాల్లో పోలీసులు తలదూర్చడం.. ఏదో ఒక వర్గానికి మేలు చేసేలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఎక్కువయ్యాయి.

కట్టడి ఇలా..

- జిల్లాలో ప్రమాదాలు అధికంగా చోటు చేసుకునే ప్రదేశాలను హాట్ స్పాట్‌లుగా గుర్తించి ఆయా ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కట్టడి చేయగలిగారు.
- నిఘా వ్యవస్థను బలోపేతం చేయటం ద్వారా గుట్కా, మట్కా, గంజాయి, ఇసుక దందా, పీడీఎస్ రైస్, నకిలీ విత్తనాల విక్రయిస్తున్న వారిపై ఎక్కువ కేసులు నమోదు చేశారు. అయితే గంజాయి, మాదకద్రవ్యాల వాడకం పెరిగింది.
- నిరంతర తనిఖీలు, పర్యవేక్షణ, సమీక్షలతో ఈ ఏడాది కేసుల సంఖ్య తగ్గింది. గతేడాది విచారణలో ఉన్న 3,788 కేసులను ఈ ఏడాది 989కు తగ్గించారు.
- గతేడాది 2,596 సీసీ టీవీలు ఏర్పాటు చేయగా ఈ ఏడాది 1,035 మాత్రమే ఏర్పాటు చేశారు.
- షీ టీంల పర్యవేక్షణ, కళాజాత ప్రదర్శనలతో, సత్వరం స్పందించడం వంటి వాటి కారణంగా కిడ్నాప్ కేసులు, లైంగిక దాడులు, అసభ్యకర ప్రవర్తన కేసులు, వరకట్నం వేధింపుల కేసులను తగ్గించగలిగారు.
- టాస్క్‌ఫోర్స్ వ్యవస్థను బలోపేతం చేయటం ద్వారా కల్తీ విత్తనాలు, కల్తీ ఆహార పదార్థాల కట్టడి తోపాటు ముఠాలను పట్టుకోగలిగారు.
- క్రైమ్ కంట్రోల్ రూం ఏర్పాటుతో కీలక కేసులు త్వరితగతిన పరిష్కరించగలిగారు.
- కార్డెన్ సెర్చ్, నాకాబందీ, కమాండ్ కంట్రోల్ రూమ్, క్విక్ రియాక్షన్ టీం తదితర కార్యక్రమాల తోపాటు రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు, స్పోర్ట్స్ మీట్ వంటివి చేపట్టారు.

అందరి సహకారంతో..

ఈ ఏడాది అన్ని వర్గాల సహకారంతో నేరాలను గణనీయంగా తగ్గించగలిగాం. ఇక ముందు కూడా ఇదే తరహా పనితీరును కొనసాగిస్తాం. ఏడాది క్రితమే లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడంతో మంచి ఫలితాలు సాధించాం. కొత్త సంవత్సరంలో కూడా పక్కా ప్రణాళికలతో నేరాల నియంత్రణకు కృషి చేస్తాం.

– కోటిరెడ్డి, ఎస్పీ

జిల్లాలో 2022, 2023లో నమోదైన కేసుల సంఖ్య

చోటుచేసుకున్న ఘటనలు	2022లో..	2023లో..
హత్యలు	30	25
చోరీలు	02	02
పగటిపూట దొంగతనాలు	17	06
రాత్రిపూట దొంగతనాలు	72	63
సాధారణ దొంగతనాలు	158	111
కిడ్నాప్‌లు	52	63
ప్రమాదాలు	323	302
మోసాలు	98	117
లైంగిక దాడులు	62	47
హత్యాయత్నం కేసులు	38	34
ఇతర కేసులు	1065	678

క్లుప్తంగా

నియామకం


మారుతికిరణ్

పరిగి: పీఎం విశ్వకర్మ యోజన చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జిగా కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతికిరణ్ భూనేటిని నియమిస్తూ బీజేపీ జాతీయ నాయకత్వం ఉత్తర్వులు జారిచేసింది. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలో ఈ పథకం ద్వారా అర్హులు లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని అధిష్టానం ఆదేశించినట్లు పేర్కొన్నారు. జాతీయ నాయకత్వం తనపై నమ్మకంతో అప్పగించిన పనిని తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు.

రైతుల ఆందోళన

పరిగి: రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తున్న కర్మాగారం ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గేట్ సమీపంలోని సుగుణ స్టీల్ ఫ్యాక్టరీ ఎదుట శుక్రవారం రైతులు నిరసన చేపట్టారు. స్థానికులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్మాగారం నుంచి వెదజల్లుతున్న కాలుష్యం వలన నష్టపోతున్న రైతులకు ప్రతి ఏడాది పరిహారం చెల్లించేందుకు యాజమాన్యం ఒప్పందం చేసుకుంది. అయితే ఈ ఏడాది రైతులకు పంట నష్టపరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తోంది. దీంతో ఎర్రగడ్డపల్లి రైతులు ఆందోళనకు దిగారు. ఎస్‌ఐ సత్యనారాయణ ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. పరిహారం చెల్లిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించుకున్నారు.

ఒగ్గురవికి అభినందనలు


రవిని సన్మానిస్తున్న కళాకారులు

బొంరాస్‌పేట: ఒగ్గుకళ పట్ల పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా సాధించిన తెలంగాణ రాష్ట్ర ఒగ్గు కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఒగ్గురవికి మండల పరిధిలోని నాందార్‌పూర్‌కు చెందిన మల్లికార్జున ఒగ్గు కళాకారులు శుక్రవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రవిని సన్మానించారు.

అసెంబ్లీ స్పీకర్‌కు శుభాకాంక్షలు


స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్సింహులు

బంట్వారం: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు నర్సింహులు శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు.

అన్నను చంపాననే మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


రాములు (ఫైల్)

బొంరాస్‌పేట: అన్నదమ్ముల మధ్య తలెత్తిన భూ వివాదాలు ఇద్దరిని బలిగొన్నాయి. మూడు నెలల క్రితం అన్నను హత్య చేసిన తమ్ముడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శంకర్ వివరాల ప్రకారం.. చౌదర్‌పల్లికి చెందిన జోగు నర్సింహులు, జోగు రాములు (21) అన్నదమ్ములు. భూమి తగాదాల కారణంతో మూడు నెలల క్రితం నర్సింహులును తమ్ముడు రాములు హత్య చేశాడు. ఈ కేసులో రాములు గురువారం బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యాడు. సొంతూరు వచ్చిన రాములు మనస్తాపంతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు జోగు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసుపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రజా సంక్షేమమే మా అభిమతం


కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న రామ్మోహన్ రెడ్డి

- కల్యాణలక్ష్మికి మరింత తోడు
- త్వరలోనే రూ. లక్షతో పాటు తులం బంగారం
- పారదర్శకంగా పథకాల అమలు
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకం పేదలకు ఉపయోగపడిందన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులకు అందుతున్న నగదుతో పాటు తులం బంగారం అందించేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పథకాల అమలులో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, తహసీల్దార్ మురళీధర్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, స్థానిక సర్పంచ్ సౌమ్యారెడ్డి, ఎంపీటీసీ ఆనందం, కామునిపల్లి ఎంపీటీసీ చందన బాల్‌రెడ్డి, అంతారం సర్పంచ్ కృష్ణ, ముజాహిద్‌పూర్ సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాంలాల్ నాయక్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

దోమ: ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రకటించారు. మండల పరిధిలోని శివారెడ్డిపల్లి, దాదాపూర్, బాస్‌పల్లితో పాటు పలు గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో రెండో రోజు ప్రజల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు ఆరు గ్యారంటీలను వివరించారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

‘గ్యారంటీ’గా అమలు చేస్తాం

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని దేవనూరు, అగ్గనూరు, చెన్నారం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, అర్హులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం విజయవంతమైందన్నారు. వీటితో పాటు ఆరోగ్యశ్రీ పథక పరిధి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచామని తెలిపారు. త్వరలో రేషన్‌కార్డులు, రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్, మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు రూ.2,500 పెన్షన్ అమలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, సొసైటీ చైర్మన్ గుబ్రాల సురేందర్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు భోజిరెడ్డి, భీమప్ప, హన్మంతు, మహిపాల్, ఖాసీం ఉన్నారు.


ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

క్రీడలతో మానసిక వికాసం

తాండూరు టౌన్: క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి దోహదపడుతాయని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. విద్యతో పాటు క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని భరోసా ఇచ్చారు. తాండూరు పట్టణంలోని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్లో వార్షిక స్పోర్ట్స్ మీట్ -2023 కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యేను సన్మానించింది. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రవూఫ్, ప్రభాకర్‌గౌడ్, మసూద్, పాఠశాల యజమాన్య కమిటీ సభ్యులు మల్లెపల్లి వెంకటేశం, ప్రిన్సిపల్ ప్రశాంత్, డైరక్టర్ సతీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈకేవైసీ కోసం పడిగాపులు


పెద్దేముల్‌లో గ్యాస్ కార్యాలయం ఎదుట బారులు తీరిన మహిళలు

పెద్దేముల్: ఈకేవైసీ కోసం గ్యాస్ కార్యాలయాల చుట్టూ వినియోగదారులు పడిగాపులు కాస్తున్నారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకే వివిధ గ్రామాల మహిళలు గ్యాస్ సెంటర్ల వద్ద క్యూ కట్టారు. పెద్దేముల్, బంట్వారం ఇండియన్ గ్యాస్ గోదాం పెద్దేముల్‌లో ఉండటంతో రెండు మండలాలకు చెందిన మహిళలు వందల సంఖ్యలో వస్తున్నారు. ఇక్కడ కనీస వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఏ గ్రామంలో గ్యాస్ కనెక్షన్‌ను అదే గ్రామంలో ఈకేవైసీ చేయాలని పలు గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పెద్దేముల్ , బంట్వారం మండలంలో సుమారు 13వేల వరకు ఇండియన్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, నాలుగు రోజుల నుంచి 3వేల వరకు ఈకేవైసీ పూర్తి చేసినట్లు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు.

గరం.. గరంగా సర్వసభ్య సమావేశం

- ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు
- పథకాలన్నింటిలో మార్పులు తెస్తాం
- బాధ్యతాయుతంగా పనిచేస్తే అభివృద్ధి
- ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: కుల్కచర్ల మండల కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. గత సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను నేటికి పరిష్కరించపోవడంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి సభ్యులు తెచ్చారు. గొర్రెలను పొందేందుకు డీడీలు కట్టి ఏడాది కావస్తున్నా ఇప్పటివరకు పంపిణీ చేయలేదని వీరాపూర్ సర్పంచ్ జనార్దన్ రెడ్డి, చాపల గూడెం సర్పంచ్ లక్ష్మణ్, దాస్యనాయక్ తాండ సర్పంచ్ శంకర్ నాయక్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమావేశం నుంచే జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యల గురించి సభలో ప్రకటించారు. పథకానికి సంబంధించి పలు మార్పులు చేయాల్సి ఉందని అమలుకు కొంత సమయం పడుతుందని తెలిపారు. గొర్రెల కోసం డీడీలు కట్టిన రైతులు కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేస్తుకొని డీడీలు తిరిగి పొందవచ్చని పేర్కొన్నారు. అలాగే మిషన్ భగీరథ అధికారులు పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులు ఇంకా పూర్తి చేయలేదంటూ కుల్కచర్ల సర్పంచ్ సౌమ్యారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సర్పంచ్‌ల పదవీకాలం ఆరు నెలలు పొడగించేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కుల్కచర్ల మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్ కోరారు.

‘కోరం’ పంచాయతీ

సమావేశం ప్రారంభంలోనే సభలో కోరం సభ్యుల సంఖ్య ఉందా జెడ్పీటీసీ రాందాస్‌నాయక్ అని ప్రశ్నించారు. 14 మంది ఎంపీటీసీలంటే 5 మందితోనే సభను ప్రారంభించడం సమంజసం కాదని నిలదీశారు. దీంతో సభలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అధికారులు కల్పించుకొని సభ్యుల సంఖ్యలో మూడో వంతు ఎంపీటీసీలుంటే కోరం సంఖ్య సరిపోతుందని నచ్చజెప్పడంతో సర్వసభ్యసమావేశం కొనసాగింది.

అభివృద్ధికి ప్రాధాన్యత

రాజకీయాలు పక్కకు పెట్టి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. పరిగి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్‌వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. దశలవారీగా గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. అనంతరం రామ్మోహన్‌రెడ్డిని అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్ నాయక్, ఎంపీడీఓ నాగవేణి, తహసీల్దార్ మురళీధర్, ఎంపీఓ కరీం, ఏపీఓ వెంకటేశ్, ఏపీఎం శోభ, ఏఓ వీరస్వామి, ఆయా శాఖల అధికారులు చంద్రప్రకాశ్, స్వప్న, ప్రవీణ్‌కుమార్, అబీబ్ అహ్మద్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు విశేష స్పందన

మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీఓ అనిత

మర్పల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీఓ అనిత తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని క్లస్టర్-1లో కొంషెట్‌పల్లి, మొగిలిగుండ్ల గ్రామాల్లో ఎంపీడీఓ రాజ్ మల్లయ్య ఆధ్వర్యంలో ఆయా గ్రా మాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య, మండల విద్యాధికా రి విద్యాసాగర్, ఏఈ శ్రావణ్‌కుమార్, ఏపీఎం పో చయ్య, ఏపీఓ అంజిరెడ్డి, ఈసీ విఠల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ బ్లాక్-2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవిందర్ పాల్గొన్నారు.

తిమ్మాపూర్, రావులపల్లి గ్రామాలల్లో..

మండల పరిధిలోని తిమ్మాపూర్, రావులపల్లి గ్రామాల్లో శుక్రవారం తహశీల్దార్ గణేశ్ ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు శేఖర్, దేవమ్మ, అబ్రహాంతో పాటు కాంగ్రెస్ పార్టీ బ్లాక్-2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మధుకర్‌రెడ్డి, నర్సింలు, వినోద్‌లతో పాటు ఆర్‌ఐ మాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం, స్పీకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

మండల పరిధిలోని ఖొంషెట్‌పల్లి గ్రామంలో శుక్రవారం రెండవ రోజు నిర్వహించిన అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు రాములు యాదవ్, స్థానిక సర్పంచ్ రఫి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘కోట్‌పల్లి’ని సందర్శించనున్న స్పీకర్

ధారూరు: జిల్లాకే తలమానికమైన ధారూరు మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టును శనివారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సందర్శించనున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రాజెక్టుకు చేరుకుని ఇరిగేషన్ అధికారులతో సమావేశంకానున్నారు. త్వరలో చేపట్టబోయే టూరిజం పార్క్ ప్రాంతాన్ని సందర్శించి, బోటింగ్‌ను ప్రారంభించనున్నారు.

అనుమతి తప్పనిసరి

ధారూరు: ధారూరు, కోట్‌పల్లి, బంటారం మండలంలో నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించే ఈవెంట్లకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ధారూరు సర్కిల్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ సంతోశ్ తెలిపారు. ఈవెంట్లలో అశ్లీల నృత్యాలు ప్రదర్శించినా.. డ్రగ్స్ వినియోగించినట్లు సమాచారం అందినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

తప్పిన పెను ప్రమాదం


అదుపు తప్పిన బస్సు

తాండూరు: ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో మహబూబ్‌నగర్ నుంచి తాండూరుకు ప్రయాణికులతో బయలుదేరింది. వేగంగా వెళ్తున్న బస్సు గండీడ్ మండల పరిధిలో అదుపుతప్పి పక్కనే ఉన్న మట్టి కుప్పలను ఢీకొట్టింది. ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ అధికారులకు డ్రైవర్ సమాచామివ్వడంతో మరోబస్సును పంపించి ప్రయాణికులను తాండూరుకు తరలించారు.

వ్యక్తి బలవన్మరణం

పరిగి: ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణ కేంద్రంలోని కొడంగల్ చౌరస్తా సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన కుమ్మరి రఘు (40) కొడంగల్‌లో నివా సముంటున్నాడు. గురువారం రాత్రి రఘు మద్యం సేవించి రావడంతో భార్యాభర్తలు గొడవ పడ్డారు. దీంతో రఘు ఇంట్లోకి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓటమి గెలుపునకు నాంది

మాజీ ఎంఎల్‌ఏ ఆనంద్

ధారూరు: లోకసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఎగరేద్దామని మాజీ ఎంఎల్‌ఏ డాక్టర్ మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ధారూరు మండలంలోని కుక్కింద గ్రామంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఓటమి గెలుపునకు నాందీ అన్నారు. సమిష్టిగా పనిచేసి చేవెళ్ల ఎంపీ స్థానాన్ని కై వసం చేసుకుందామని అన్నారు. గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌ఏ ఆనంద్

చర్యలు తీసుకోండి

పూడూరు: దేవతామూర్తుల విగ్రహాలను శివారెడ్డిపేట్ చెరువులో వేసిన రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామ రెవిన్యూ పరిధిలోని గా లిపోచమ్మ, వీరహనుమాన్ విగ్రహాలను తొలగించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహాలను యథాస్థలంలో పునఃప్రతిష్ఠించాలని కోరారు. ప్రతిష్ఠించకుంటే పోలీస్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సెన్సార్‌బోర్డ్ మెంబర్ మల్లేశ్‌పటేల్, భజరంగ్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, మండల బీజేపీ ఉపాధ్యక్షుడు రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న భజరంగ్‌దళ్ నాయకులు

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

దోమ: ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీ విద్య కోరారు. శుక్రవారం దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఎయిడ్స్, హెచ్‌ఐవీలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎయిడ్స్, హెచ్‌ఐవీలపై అవగాహన ఎంతో అవసరమన్నారు. ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజనీకుమారి, రేణుక, శోభ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఉపాధ్యాయులు

నకిలీ ముఠా గుట్టురట్టు


నిందితులను చూపిస్తున్న పోలీసులు

- నిందితులు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- పరారీలో మరో ఇద్దరు

నవాబుపేట: బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీ టీవీలు విక్రయిస్తున్న ముఠాను నవాబ్ పేట పోలీసులు పట్టుకున్నారు. వికారాబాద్ డీఎస్పీ నర్సింహులు శుక్రవారం ఠాణాలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఫరితుల్లా, హలీమ్ ఖాన్, పర్వేజ్ గురువారం సాయంత్రం సంగారెడ్డి నుంచి హెచ్ ఆర్ 06 వై 3419 మారుతి స్విఫ్ట్ కార్, రెండు యాక్టివా వాహనాలపై సోనీ కంపెనీ పేరుతో ఉన్న టీవీలను తీసుకొని నవాబుపేట వైపు వస్తున్న నిందితులను పులుమామిడి గేటు వద్ద ఎస్‌ఐ భరత్ రెడ్డి తన సిబ్బందితో అదుపులోకి తీసుకొని విచారించగా.. సంగారెడ్డిలో ఉంటూ టీవీలు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన ముగ్గురిని సంగారెడ్డికి తీసుకువెళ్లి, వారు నివసిస్తున్న ఇంట్లో సోదాలు చేశారు. పరాజ్ ఖాన్, మహమ్మద్ అబ్దుల్ రఫీ, షాద్ మియా, శానుస్ మీర్జా, మహమ్మద్ పర్వీన్, శశికాంత్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి సోనీ పేరుతో ఉన్న 71 టీవీలు, నాలుగు స్కూటీలు, ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పవన్ శర్మ, సలీంలు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ, సిబ్బందిని ఎస్పీ కోటిరెడ్డి అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో మోమిన్‌పేట సర్కిల్ సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ భరత్ భూషణ్, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

తాండూరు: తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా మహా పడిపూజ కార్యక్రమం జరిగింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన పూజా కార్యక్రమానికి మాలధారణ చేసిన స్వాములతో పాటు వేలాది మంది భక్తులు హాజరై పడిపూజను తిలకించారు. ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్‌రాజుగౌడ్, వికారాబాద్ మండల జెడ్పీటీసీ ప్రమోదిని, తాండూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణా శ్రీనివాసాచారి, నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు భక్తులు తదితరులున్నారు.


పడిపూజ నిర్వహిస్తున్న రోహిత్‌రెడ్డి